విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

ఓటింగ్‌శాతాన్ని పెంచాలి

- ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సహకరించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మార్చి 18 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఎన్నికలు జరిగేలా తమవంతు సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులకు జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో ఓటింగ్‌శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, అప్పటి నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న స్క్రూటినీ, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఫారం 12డీని పూర్తి చేసి ఏప్రిల్ 22 లోగా ఇవ్వాలన్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్ల వయసు పూర్తయిన వారు ఏప్రిల్ 29 వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేఅ వకాశంఉ ందన్నారు.

అభ్యర్థులు ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులిస్తామని, కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయరాదన్నారు. కలెక్టరేట్‌లో సమీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారం, నిర్వహణపై నిఘా ఉంచామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, ఆయా పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

2,057 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్‌శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,057 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ ఉంటుందని, 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌తోపాటు సీవిజిల్ యాప్, కేవైసీ యాప్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లను ప్రజలకోసం అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్(ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను సోమవారం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో సోమవారం సమీకృత కలెక్టరేట్ లోని రూమ్ నంబర్ జీ-1లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, ఎంసీఎంసీని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, మీడియా ప్రతినిధులు కార్యాలయ సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు.

సేవాలాల్ భవనానికి రూ.20లక్షలు

గిరిజనా యకులకుప్రొసీడింగ్‌కా పీనిఅం దజేస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, మార్చి 18 : అచ్చంపేటలో సేవాలాల్ భవన నిర్మాణానికి రూ.20లక్షల ప్రొసీడింగ్‌ను గిరిజన నాయకులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సోమవారం అందజేశారు. అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో గిరిజనసేవ, ఉద్యోగ సంఘాల నేతలకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. అదేవిధంగా పట్టణంలో బాబూ జగ్జీవన్‌రామ్ భవనం అదనపు నిర్మాణానికి రూ.20లక్షల ప్రొసీడింగ్‌ను అందజేశారు. అనంతరం పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు మంత్రియానాయక్, ప్రతాప్‌రెడ్డి, గిరిజన సంఘం నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 10 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్, మార్చి 18 : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పది ఫిర్యాదులు అం దినట్లు ఎస్పీగైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో న్యాయం చే యాలని ఆరు, భూ పంచాయతీకి సంబంధించినవి మూడు, భార్యాభర్తల మధ్య ఘర్షణకు సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్లు ఎస్పీ వెల్లడించారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

బహుమతులు,షీల్డ్‌తో క్రీడాకారులు

బల్మూరు, మార్చి 18 : మండలంలోని కొండారెడ్డిపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. కాగా గెలుపొందిన జట్లకు గ్రామానికి చెందిన బాలాగౌడ్ రూ.20 వేలు ప్రథమ బహుమతి, పంబ రాధాకృష్ణ రూ.15వేలు ద్వితీయ బహుమతిని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రావు, భాస్కర్, నిరంజన్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా కక్షయింటు శ్రీ రామావత్ మాధ్య నాయక్ తండ్రి లాల్య నాయక్, వయస్సు 53 సంవత్సరాలు, వృత్తి: ప్రభుత్వ ఉద్యోగి, నివాసం: ఇంటి నెం. 11-105/20, ఆదర్శనగర్ కాలనీ, అచ్చంపేట పట్టణ, నాగర్‌కర్నూలు జిల్లా, అచ్చంపేట మండలం మరియు టౌన్ శివారులో గల భూమి సర్వే నం.26లో గల ప్లాట్ నెం.69, 74 వైశాల్యం 242.00చ॥గ॥లు ఇందుకు సమానమగు 200.840 చ॥మీ॥ల ప్లాటును శ్రీమతి పెరుమార్ల చంద్రకళ భర్త బింతలయ్య నివాసం అచ్చంపేట టౌన్ మరియు మండలము, నాగర్‌కర్నూల్ జిల్లా గారి దగ్గర తేది: 20-04-2002 రోజున డాక్యుమెంట్ నం. 394/2002 అచ్చంపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ద్వారా కొనుగోలు చేసినారు. అట్టి ప్లాటుకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు 621/1996, తేది 24-05-1996 గలది తేది 05-03-2024 రోజున అందాజు సమయం ఉదయం 10:30లకు నేను అచ్చంపేట నుండి నాగర్‌కర్నూల్ ఆర్.టి.సి. బస్సులో వెళ్ళుచుండగా పోయినది. అట్టి ప్లాటుపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎ.డి.బి. అచ్చంపేట బ్రాంచ్ నందు ఋణ మంజూరు కొరకు దరఖాస్తు చేసి యున్నారు. ఒకవేళ సదరు డాక్యుమెంట్ అసలు దస్తావేజు ఎవరైన కలిగి ఉన్నచో ఈ ప్రచురణ తేది నుండి (7) రోజులలో ఈ దిగువ సంతకందారుని వద్ద సంప్రదించగలరు.

జి. రాజేందర్, అడ్వకేటు,
అచ్చంపేట పట్టణం, నాగర్‌కర్నూల్ జిల్లా.
సెల్: 9440231223

10,513 మంది హాజరు

- జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు 19 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి
- ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

నాగర్‌కర్నూల్, మార్చి 18: టెన్త్ వార్షిక పరీక్షలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 19మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10,535 మందికి గానూ 10,513 మంది హాజరు కాగా, 19 మంది గైర్హాజరైనట్లు డీఈవో గోవిందరాజులు వెల్లడించారు. తొలిరోజు పరీక్షకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బంధువులతో కేంద్రాలకు వచ్చారు. జిల్లా కేంద్రంతోపాటు బిజినేపల్లిలోని పరీక్ష కేంద్రాలను డీఈవో తనిఖీ చేశారు. ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ జిల్లా వ్యాప్తంగా 34 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 99.8శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో తెలిపారు.

కల్వకుర్తిలో 8 మంది గైర్హాజరు..

కల్వకుర్తి రూరల్, మార్చి 18 : కల్వకుర్తి పట్టణం, మండలంలో సోమవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల,బాలుర ఉన్నత పాఠశాల, జేపీనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహాత్మాజ్యోతిబాపూలే బీసీబాలికల వికాస్, శ్రీ చైతన్య పాఠశాలలో నిర్మల పాఠశాలలతో పాటు మండలంలోని మార్చాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది కేంద్రాల్లో మొత్తం 1,741 మంది విద్యార్థులను పరీక్షలకు కేటాయించారు. మెదటి పరీక్షకు 1,741 మంది విద్యార్థులకు 8 గైర్హాజరు కాగా 1,733 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకున్నారు. ఇన్విజిలేటర్ల వద్ద కూడా సెల్‌ఫోన్‌లను నిషేధించారు. విద్యార్థులకు కల్పించిన వసతులు, తదితరాలను కేంద్రం సీఎస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎంఈవో బాసునాయక్ పర్యవేక్షించారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తితే పరీక్ష కేంద్రంలోని నిర్వాహకుడిని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

అచ్చంపేట టౌన్, మార్చి 18 : పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు సోమవారం 144 సెక్షన్ అమలు చేశారు. 6 కేంద్రాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

279మంది హాజరు

లింగాల, మార్చి 18 : మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులం, జెడ్పీ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో సోమవారం టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అంబట్‌పల్లి, లింగాల జెడ్పీ హైస్కూల్, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకులం, ఆశ్రమ బాలికల పాఠశాలలకు చెందిన మొత్తం 279 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు రాంసింగ్, నరేందర్‌రెడ్డిలు తెలిపారు.

కొల్లాపూర్‌లో ఒకరు గైర్హాజరు

కొల్లాపూర్, మార్చి 18 : కొల్లాపూర్‌లో మొత్తం 1,089మందికి గానూ ఇద్దరు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి రామారావు తెలిపారు. ఒక్క నిమిషం నిబంధన ఎత్తివేసి ఐదు నిమిషాలు సమయం కేటాయించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

566మంది హాజరు

పెద్దకొత్తపల్లి, మార్చి 18: మండలవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షకు 566 మంది విద్యార్థులు హాజరైనట్లు సూపరింటెండెంట్ కొండా రెడ్డి తెలిపారు. 28మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించినట్లు ఆయన వెల్లడించారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, మార్చి 18 : మండలకేంద్రంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో 727మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు గానూ నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా జెడ్పీ గాంధీ స్మారకోన్నత పాఠశాలలో 200మందికి గానూ 199 మంది హాజరయ్యారు. జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 200 మంది, సెయింట్ మేరీ స్కూల్‌లో 190మంది, సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 137మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు.

వంగూరులో

వంగూరు, మార్చి 18 : మండలంలో రెండు కేంద్రాల్లో పదిపరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 240 మంది విద్యార్థులకు ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో 120 మంది విద్యార్థులు పరీక్షలు వెల్దండలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ లో నిర్వహించిన రెండు పరీక్ష కేంద్రాల్లో 361 మంది విద్యార్థులకు మొత్తం విద్యార్థులు హాజరరైనట్లు పరీక్షల డిపార్ట్‌మెంట్ అధికారులు అమర్‌సింగ్, రవి కుమార్, శ్రావణ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షల కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి, బందోబస్తు ఏర్పాటు చేశారు.

వంగూరులో

వంగూరు, మార్చి 18 : మండలంలో రెండు కేంద్రాల్లో పదిపరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 240 మంది విద్యార్థులకు ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో 120 మంది విద్యార్థులు పరీక్షలు హాజరైనట్లు ఎంఈవో శంకర్‌నాయక్ తెలిపారు. దీంతో 100 శాతం విద్యార్థులు పరీక్షలు వ్రాశారన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

చారకొండలో ప్రశాంతం..

చారకొండ, మార్చి 18 : పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని చీఫ్ సూపరింటెండెంట్ ఎండీ జహంగీర్ తెలిపారు. మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రంలో మొత్తం 202 మంది విద్యార్థులకు అందరూ పరీక్షలకు హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేశారు.

వందశాతం హాజరు

ఉప్పునుంతల, మార్చి 18 : మండల కేంద్రంలోని ఉప్పునుంతల జెడ్పీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 166 మందికి మొత్తం విద్యార్థులు పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు.

197మంది హాజరు

పెంట్లవెల్లి, మార్చి 18 : పెంట్లవెల్లి జెడ్పీ బాయ్స్ హైస్కూల్ కేంద్రంలో 102మంది, జటప్రోలు జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 95మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో చంద్రుడు తెలిపారు.

తాడూరులో ఒకరు గైర్హాజరు

తాడూరు, మార్చి 18 : మండలకేంద్రంలోని కేజీబీవీలో 252మంది, సిర్సవాడ జెడ్పీ హెచ్‌ఎస్‌లో 141మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు.

కల్వకుర్తిలోప రీక్షకేం ద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్‌లో విద్యార్థుల హాల్‌టికెట్లనుప రిశీలిస్తున్న నిర్వాహకులు

చారకొండలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

అచ్చంపేటలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

కొల్లాపూర్ బాలికల హైస్కూల్‌లో హాల్‌టికెట్‌నె ంబర్లను చూసుకుంటున్నవిదా ్యర్థినులు



నాగర్‌కర్నూల్‌లో పరీక్ష హాజరైన విద్యార్థులు

బీఆర్ఎస్‌లో ఆర్ఎస్పీ చేరికపై హర్షం

వంగూరు, మార్చి 18 : డా.ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురాబీ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడంపై మండల బీఆర్ఎస్ నేతలు సురేందర్,తవిటీ నాగేష్, అంజిలు సోమవారం ప్రకటనలో హ ర్షం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పదవులు, అధికారం అనుభవించి నేడు అధికారం కోల్పోయాక కొంత మంది ఎంపీ, ఎమ్మెల్యేలు స్వార్థంతో పార్టీని వీడుతున్నారని వారు విమర్శించారు.

విద్యుత్ కోతలుండొద్దు

- ఎంపీపీ ప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, మార్చి 18 : వేసవి దృష్ట్యా గ్రామాల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అధికారులకు ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పురాతన స్తంభాలను తొలగించి కొత్తవి వేయాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఉపాధి పని కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా నీటిని అందిస్తూ చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పనులను సభలో చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ గౌరమ్మ, వైస్ ఎంపీపీ దీపిక, ఎంపీడీవో గేంద్రం, డిప్యూటీ తాసీల్దార్ రమేశ్‌నాయక్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య రానీయకుండా చూడాలి

వెల్దండ, మార్చి 18 : గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఈ లీలావతి అన్నారు. సోమవారం తాండ్ర, జూపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లతో పాటు వెల్దండ సబ్‌స్టేషన్‌ను ఆమెతనిఖీ చేశారు. వసతులు, సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఈ సూర్యనాయక్ పాల్గొన్నారు.

నిరంతరంగా విద్యుత్ అందించాలి

చారకొండ, మార్చి 18 : ప్రజలకు విద్యుత్ నిరంతరం అందించాలని, సరఫరాలో అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఎస్ఈ లీలావతి హెచ్చరించారు. సోమవారం మండలంలోని జూపల్లిలో సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ జానకీరాంనాయక్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు

- మూడు చెక్‌పోస్టులలో నిరంతరం నిఘా
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మాధవి

సమావేశంలో మాట్లాడుతున్నపా ర్లమెంట్‌అసి స్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ,ఆర్డీవో మాధవి

అచ్చంపేట రూరల్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అచ్చంపేట ఆర్డీవో మాధవి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, జూన్ 4వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సరిహద్దులోని మూడు చెక్‌పోస్టులలో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రూ.50వేల లోపు నగదు వెంట తీసుకెళ్తే ఇబ్బందులుండవని, అంతకు మించి తరలిస్తూ పట్టుబడితే అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు చూపితేనే పంపుతామన్నారు. ఉప్పునుంతల మండలంలోని లత్తిపూర్, బల్మూరు మండలం పాలిశెట్టిపల్లి శివారులోని జేఎంజే పాఠశాల, అమ్రాబాద్ మండలం మన్ననూర్ శ్రీశైలం-హైదరాబాద్ రహదారి చెక్‌పోస్టు, ఎస్ఎస్‌టీటీ చెక్‌పోస్టుల వద్ద 24గంటలు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా 339 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా అందులో 74 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,47,621 ఓటర్లు ఉండగా అందులో స్త్రీలు 1,24,382, పురుషులు 1,23,233మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నట్లు పేర్కొన్నారు. 44 రూట్లలో రూట్ ఆఫీసర్లను గుర్తించామని, త్వరలోనే అన్ని రాజకీయపార్టీల నాయకులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. 85 ఏండ్లు పైబడి మంచానికే పరిమితమైన వారికి మాత్రమే ఇంటి వద్ద ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ టీం సభ్యులు, గెజిటెడ్ ఆఫీసర్‌గా ఎంపీవో, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, పంచాయతీ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారన్నారు. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జిగా అచ్చంపేట తాసీల్దార్ మురళీమోహన్, మీడియాకు సమాచారం అందించేందుకు ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తాసీల్దార్ రాములు వ్యవహరిస్తారన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా సీవీజీ యాప్‌లో లేదా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డీటీ కృష్ణాజీ, శశిధర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లినిక్ లైసెన్స్‌ను రద్దు చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 18 : జిల్లాకేంద్రంలోని ఓ ఆర్ఎంపీ క్లినిక్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరుతూ డిప్యూటీ డీఎంహెచ్ వో కార్యాలయంలో అధికారికి బీఎస్పీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. బిజినేపల్లి మండలం గుడ్లనర్వకు చెందిన అరవింద్‌రెడ్డి గత నెల 15న క్లినిక్‌కు వచ్చాడు. టెస్టులు చేసిన అనంతరం ఆరునెలల పాటు మందులు వాడాలని, వారానికోసారి చెకప్ అవసరం అని చెప్పి మందులిచ్చారు. మెడిసిన్‌వాడిన మూడు వారాలకు శరీర బరువు 65కిలోల నుంచి 45-40 కిలోలకు తగ్గి చర్మం అంతా పొడిబారింది. వైద్యం వికటించి 19ఏండ్ల యువకుడు మంచానికే పరిమితమయ్యాడని నాయకులు పేర్కొన్నారు. తక్షణమే ఆ క్లినిక్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కల్యాణ్, ఈసీ మెంబర్ రాము, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రా ంచందర్, శివకృష్ణ, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

సేవాలాల్ విగ్రహం మాయం

కోడేరు, మార్చి 18 : మండలంలోని ఎత్తం గట్టుపై ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ విగ్రహం మాయమైందని గిరిజన సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి అటవీశాఖ అధికారులు అక్రమంగా తీసుకెళ్లారని సేవాలాల్ ఉత్సవకమిటీ సోమవారం ప్రకటనలో ఆరోపించింది. బంజారాల నమ్మకాన్ని వమ్ము చేస్తూ అటవీశాఖ అధికారులు విగ్రహాన్ని తీసుకెళ్లడం శోచనీయమన్నారు. విగ్రహాన్ని పునః ప్రతిష్ఠ చేయాలని వారు డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా గుడి నిర్మించి తీరుతామని వారు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

బల్మూరు, మార్చి 18 : మండలంలోని కొండనాగులకు చెందిన చెంచు జిల్లా నాయకుడు ఉడుత్తనూరి నర్సింహ్మ (60) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. ఇంటి అవరణలో బట్టలు తీస్తుండగా ప్రమాదవశాత్తుగా షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న చెంచు, గిరిజనసంఘం, వివిధ పార్టీల నాయకులు గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు.

నెల గడిచినా.. అందని వేతనాలు

కొల్లాపూర్, మార్చి 18 : జిల్లాలోని సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ సిబ్బందికి ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతనం ఇంతవరకు ఖాతాల్లో జమ కాలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. జిల్లాలో మొ త్తం 720 మందిలో ఎంఐఎస్, సీఆర్‌పీ, మెసెంజర్లు, ఐఈఆర్‌టీ, కేజీబీవీ స్టాఫ్, యూఆర్ఎస్ సిబ్బంది సర్వశిక్ష అభియాన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో తమకు రెగ్యులర్‌గా 4, 5 తే దీల్లోనే వేతనాలు జమ కాగా ప్రస్తుతం నెల పూర్తయి 18రోజులు గడిచినా జీతం పడకపోవడంతో ఇంటి అద్దె, స్కూల్ ఫీజులు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు.

టీఎస్ఎస్‌వో జిల్లా అధ్యక్షుడిగా శేఖర్

వెల్దండ, మార్చి 18 : మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొప్పు శేఖర్ తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ సోమవా రం శేఖర్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్,సుదర్శన్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించరూ?

పెద్దకొత్తపల్లి, మార్చి 18 : మండలంలోని వెన్నచర్ల చెందిన జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఎనిమిది మంది ఉపాధ్యాయులకు గానూ ఐదుగురు ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరు